


KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 210 శుక్రవారం 31 జులై 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar


### పశ్చిమాసియా సంక్షోభంపై

# కేంద్రం అలర్ట్

- ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై మోదీ కీలక ఆదేశాలు
- పశ్చిమాసియా పరిస్థితిపై నాలుగోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశం
- ఇంధనం, ఎరువుల సరఫరాపై సమీక్ష, సముద్ర నావికుల భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన



### దళారుల మాటలు నమ్మి

# మోసపోవద్దు

- విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం
- విద్యుత్ శాఖకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని గొట్టిపాటి సూచన
- అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించాలని ఆదేశం
- విద్యుత్ నష్టాలు అరికట్టేందుకు భూగర్భలైన్లు వేస్తున్నామని మంత్రికి వివరించిన అధికారులు



**అమరావతి**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ - మిగతా3లో



## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు
- అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్
- రాజకీయాల కోసమే బిల్లు తెచ్చారని ఆరోపణ
- పేపర్ లీక్‌లపై అమలు వ్యవస్థ బలోపేతం చేయాలని సూచన
- విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్న ఖర్గే

### భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి

# కౌంట్‌డౌన్

- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం
- రూ.17,883 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- సభకు 3 లక్షల మంది వస్తారని అంచనాతో సన్నాహాలు



**అమరావతి**

ఉత్తరాంధ్ర ప్రగతి ప్రయాణంలో నవశకానికి నాంది పలుకుతూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది. మెగా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం కానుంది. అదేరోజు మరో 17 వేల 883 కోట్ల రూపాయల విలువైన ఇంధన, ఉపరితల రవాణా శాఖల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ ఈవెంట్‌ను ప్రజల పండుగలా నిర్వహించాలని భావిస్తున్న ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధాన్యతను వివరిస్తూ "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అనే ప్రత్యేక థీమ్‌తో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారమయ్యేందుకు సమయం ఆసన్నమైంది. భోగాపురంలో 5 వేల 641 కోట్లతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న జాతికి అంకితం చేస్తారు. ఎయిర్‌పోర్టుతో పాటు 17 వేల 883 కోట్ల - మిగతా3లో

## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



## గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారు

- కర్నూలు జిల్లా లోకేశ్ పర్యటన
- పత్తికొండ మండలం హోసూరులో టాటా పవర్, సుజలాన్ కంపెనీల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే కంపెనీలు ఏపీకి క్యూకట్టాయన్న లోకేశ్



**అమరావతి**

గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారని మంత్రి నారా లోకేశ్? పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కడుతున్నట్లు తెలిపారు. రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ కంపెనీలన్నీ రాష్ట్రంలో ఇప్పటికే తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు లోకేశ్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా లోకేశ్ కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరులో రెండు భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ చేపట్టిన 800 మెగావాట్ల సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. - మిగతా3లో

## ఈ20 పెట్రోల్ వాహనాలకు సురక్షితమే

- ఇంజిన్ దెబ్బతినదు కానీ మైలేజ్ తగ్గొచ్చు!'- కేంద్రం కీలక ప్రకటన
- ఈ20 పెట్రోల్ వల్ల వెహికిల్ ఇంజిన్‌కు నష్టం లేదన్న కేంద్రం
- 20 కోట్ల బైకులు, 3 కోట్ల కార్లలో సమస్యల్లేవని స్పష్టం
- కొన్ని వాహనాలకు మైలేజ్ స్వల్పంగా తగ్గొచ్చని క్లారిటీ- వందేమాతరం బిల్లు ఆమోదం





## యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం

- కేంద్రం ఆ హామీలను నిలబెట్టుకుంటే సంతోషం: వాంగ్‌చుక్
- వందే భారత్ ప్రయాణాన్ని ప్రశంసించిన సోనమ్ వాంగ్‌చుక్
- విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు పెట్టొద్దంటూ కేంద్రానికి విజ్ఞప్తి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే డిమాండ్

### చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు

# ఆలోచనలే

- 'ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం
- కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు
- నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు
- బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం.
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**శ్రీకాకుళం**

మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు కుటుంబంపై చంద్రబాబు సర్కార్ కుట్రకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా మార్చి సీదిరి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. అసలు యాక్సిడెంట్ కేసును హత్య కేసుగా ఎలా మారుస్తారు? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. అంపోలు జైలులో ఉన్న సీదిరిని పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్ జగన్.. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి సర్కారు అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ - మిగతా3లో

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి కౌంట్‌డౌన్

-మొదటిపేజీ తరువాయి

విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో రేచర్ల-గురవాయిగూడెం మధ్య 752 కోట్లతో పూర్తి చేసిన ప్యాకేజీ-4 పనులను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఇదే రహదారిలో గురవాయిగూడెం-దేవరపల్లి మధ్య డిజైన్ మార్పు చేసి రూ. 926 కోట్లతో పూర్తి చేసిన రోడ్డును ప్రారంభిస్తారు. రూ.160 కోట్లతో చీఎ-67లో పూర్తి చేసిన నాలుగు లేన్ల అనంతపురం జిల్లా తాడిపత్రి బైపాస్‌ను ప్రారంభిస్తారు. ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ పార్ట్‌ఏ, బీ ట్రాన్స్‌మిషన్ స్కీంలో భాగంగా 4 వేల 370 కోట్లతో చేపట్టిన అనంతపురం, కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

**శంకుస్థాపనల వివరాలివే:** విశాఖ జిల్లా భీమిలి పరిధిలోని తర్లువాడలో ‘‘ూాశ్రూ టెక్నాలజీస్ సెమీ కండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. దక్షిణకొరియాకు చెందిన ‘‘్రూాూజు సంస్థ భాగస్వామ్యంతో ఈ యూనిట్ రూపుదిద్దుకుంటోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 30 ఎకరాలు కేటాయించింది. మొదటి దశలో 468 కోట్లతో చేపట్టే సెమీ కండక్టర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 5 వేల 550 కోట్లతో ‘పవర్ గ్రిడ్ కర్నూలు-4 ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్’ చేపట్టబోయే ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరి స్తారు. 16 కోట్లతో చీఎ-565లో పెంచలకోన-ఏర్పేడు మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

**సభకు 3 లక్షల మంది వస్తారని అంచనా:**

ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. మహానాడు లాంటి భారీ సభలు నిర్వహించిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలను నారా లోకేశ్ సారథ్యంలోని 13 కమిటీలకు అప్పగించారు.



సభకు 3 లక్షల మంది జనం వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

**13 వేల మందితో థింసా నృత్యం:**

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ వేడుక సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా ప్రభుత్వం వినూత్నంగా అవుట్‌రీచ్ కార్యక్రమాలను రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్, క్షేత్రస్థాయి ప్రచారం చేస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో క్విజ్ పోటీలు, ఉపన్యాస పోటీలతో పాటు ఫ్లాష్ మాబ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేందుకు 3ఎ, 5ఎ రన్ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నారు.

బహిరంగ సభకు మోదీ, చంద్రబాబు, పవన్ వచ్చే ఓపెన్ టాప్ రథాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. 13 వేల 500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులతో థింసా నృత్య ప్రదర్శన ద్వారా ప్రధానికి స్వాగతం పలకనున్నారు. తద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సృష్టించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. థింసా నృత్య ప్రదర్శన ద్వారా ప్రధానికి స్వాగతం పలకనున్నారు. తద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సృష్టించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. ‘ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం. కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు. నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు. తెలిసో తెలియకుండా యాక్సిడెంట్ చేశాడు. కానీ కేసును ట్విస్ట్ చేసి హత్య చేశాడని, కుట్ర చేసి సీదిరి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే.. ఆ పిల్లాడి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం ఎంతవరకు సరైంది. బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం. అతిసామాన్యమైన కుటుంబం నుంచి వచ్చి వైద్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పల రాజును ఇబ్బంది పెట్టేలా తన కెరీర్‌ను నాశనం చేయాలని దుర్మార్గకపు ఆలోచన చేస్తున్నారు.

18 ఏళ్ల విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్న చంద్రబాబు గడ్డి తింటున్నారా?. మనిషా? రాక్షసుడా?. ఇదే టీడీపీ నేతలు ఎవరైనా చేస్తే ఇలాగే శిక్షలు విధిస్తారా?. ఇదే శ్రీకాకుళం ఎమ్మెల్యే, పాతపట్నం ఎమ్మెల్యే యాక్సిడెంట్ చేస్తే.. ఈ కేసుల్లో ఎవరిని అరెస్టు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కోలా చేస్తే వ్యవస్థ బతకదు. చంద్రబాబు విష విత్తనాలు నాటుతున్నారు. అదే వ్యవస్థను నాశనం చేస్తున్నారు.

హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రమాదంలో గాయపడ్డ బాధితుడ్ని రక్షించేందుకు సీదిరి కుమారుడు ప్రయత్నించాడు. 108కి ఫోన్ చేశాడు. సీపీఆర్ చేశాడు. సీదిరి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యాదవ మంత్రిని పంపించి ర్యాలీలు చేస్తారా?. అదే చంద్రబాబుకు బాధిత కుటుంబానికి మంచి చేయాలన్న మనసుంటే ఇరు



కుటుంబాల మధ్య సయోధ్య చేకూర్చి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చేసే ప్రయత్నం చేయాలి.

పేదలంటే ప్రేమలేదు. బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకుంటాడు. చంద్రబాబుకు బీసీలు కాదు యాదవులంటేనే ప్రేమలేదు. ప్రకాశం జిల్లాలో యాదవ కుటుంబం దాడి చేసి తిరిగి ఆ కుటుంబంపైనే కేసు పెట్టించిన ఘనుడు చంద్రబాబు. చరిత్రలో తొలిసారి యాదవ మహిళను వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్‌ని చేసింది. ఆ తర్వాత చంద్రబాబు కుట్రతో ఆమెకు పదవిని దూరం చేశాడు. విశాఖలో యాదవ భవన్‌ను పూర్తి కాకుండా అక్కడో కుట్ర. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యుల్ని పరామర్శించలేదు. వైఎస్ జగన్ వెళ్లాడు. బాధితుల్ని పరామర్శించాడు.

ఫిషింగ్ హార్బర్‌లను అమ్ముకుంటుంటున్నాడు. మత్స్యకారుల జీవితాల్ని నాశనం చేస్తున్నాడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేదు. అమ్మఒడి లేదు. నోరు తెరిస్తే అబద్ధాలు, చేస్తే మోసాలు. ప్రశ్నిస్తే వాళ్లమీద తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, జీవితాలు నాశనం అవుతాయన్న జ్ఞానం లేదు. సీదిరి అప్పల రాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తోంది. అప్పల రాజు విషయంలో న్యాయం గెలుస్తోంది. త్వరలో ఆయన జైలు నుంచి బయటకు వస్తారు’ అని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

# మండలి రేసులో ఆ నలుగురు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లోఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికార కూటమి ప్రభుత్వం కసర త్తును అత్యంత ముమ్మరం చేసింది. రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఈ నామినేటెడ్ స్థానాలను భర్తీ చేసేందుకు వీలుగా ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల పేర్లపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీకి నమ్మకంగా సేవలు అందిస్తూ, గత ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల వల్ల అవకాశాలు కోల్పోయిన సీనియర్ నాయకులతో కూడిన తుది జాబితాను సిద్ధం చేసే పనిలో టీడీపీ అధిష్టానం నిమగ్నమైంది.ప్రస్తుతం ఈ ఎమ్మెల్సీ రేసులో తెలుగుదేశం పార్టీ కి చెందిన పలువురు హేమాహేమీల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, రాయలసీమకు చెందిన సీనియర్ నేత, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, కొమ్మాలపాటి శ్రీధర్, మరియు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. గతంలో రాజ్యసభ స్థానాలను ఆశించి భంగపడిన వర్ల రామయ్య వంటి నేతలకు ఈసారి ఖచ్చితంగా అవకాశం కల్పించి శాసనమండలికి పంపాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు పిఠాపురం వర్మ కూడా రేసులో నిలిచారు. శాసనమండలిలో డిప్యూటీ ఛైర్మన్ మేయానా జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఈ ఖాళీలను భర్తీ చేయడం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఒకవైపు సామాజిక సమీకరణాల లెక్కలు చూస్తూనే, మరోవైపు ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా దళిత, బీసీ మరియు మైనారిటీ సామాజిక వర్గాలకు ఈ పదవుల్లో సముచిత స్థానం కల్పించే దిశగా కసరత్తు సాగుతోంది. గవర్నర్ కోటా కింద భర్తీ చేసే ఈ అత్యున్నత స్థానాలకు సంబంధించిన అధికారిక ప్రకటన నేడు రాజ్‌భవన్ నుండి వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిన అభ్యర్థుల జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందనే దానిపై అమరావతి రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ క్లైమాక్స్‌కు చేరింది.



**వంగవీటి రాధకు క్లియర్**విజయవాడ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. ముఖ్యంగా వంగవీటి కుటుంబానికి ఇక్కడ ఉన్న క్రేజ్, ఫాలోయింగ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గడిచిన ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణను ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం శతవిధాలా ప్రయత్నించింది. మచిలీపట్నం ఎంపీ సీటుతో పాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు పలు ఆకర్షణీయమైన ఆఫ్షన్లను ఇచ్చింది. అయినప్పటికీ, రాధా మాత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అయితే, అక్కడ అప్పటికే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేగా ఉండి.. స్వల్ప తేడాతో ఓడిపోయిన బొండా ఉమామహేశ్వరరావు ఉండటంతో.. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బొండాను కాదనలేక, రాధా సైలెంట్ అయ్యి పోటీకి దూరంగా ఉండిపోయారు.తెలుగుదేశం పార్టీకి, వంగవీటి రాధాకు కాగల కార్యాన్ని ఇప్పుడు బొండా ఉమనే స్వయంగా నెరవేరుస్తున్నారు ఇటీవల గుంటూరు సభ వివాదం, వైఎస్ఆర్‌సీపీ నేతలతో ఒకే వేదికను పంచుకోవడం, నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అంతర్గత వివాదాల కారణంగా బొండా ఉమ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోందనే టాక్ వినిపిస్తోంది. అధిష్టానం దృష్టిలో ఆయనపై నమ్మకం సడలడం, వివాదాస్పద అంశాల్లో ఇరుక్కోవడంతో బొండా స్థానం ఇరకాటంలో పడింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి.. విజయవాడ సెంట్రల్ పరిధిలో వంగవీటి కుటుంబానికి ఉన్న మాస్ ఇమేజ్, వర్గీకరణలకు అతీతంగా ఉన్న అభిమానం ముందర, రాధా ప్రత్యక్ష బరిలో నిలబడితే ప్రత్యర్థి ఎవరైనా సరే గెలుపు సాధించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యమే.ఇన్నాళ్లూ సెంట్రల్ నియోజకవర్గం సీటు విషయంలో బొండా ఉమ అడ్డుగోడగా ఉన్నారని భావించిన వారికి, ఇప్పుడు ఆయన స్వయంకృతాపరాధాలు, మారిన రాజకీయ సమీకరణలు సరికొత్త అవకాశాన్ని ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అధిష్టానం కూడా సెంట్రల్‌లో ప్రత్యామ్నాయ నాయకత్వం వైపు లేదా క్లీన్ ఇమేజ్ ఉన్న బలమైన నేత వైపు మొగ్గు చూపే పరిస్థితిని బొండా ఉమనే స్వయంగా కల్పించినట్లయింది. పార్టీ కోసం, నియోజకవర్గంలో మళ్లీ తిరుగులేని ఆధిపత్యం కోసం రాధా లాంటి మాస్ లీడర్‌ను రంగంలోకి దింపితే తిరుగుండదనే భావన టీడీపీ క్యాడర్‌లోనూ వ్యక్తమవుతోంది. రాధా పోటీ చేసేందుకు ఉన్న ఏకైక అడ్డంకి తొలగిపోయినట్లేనని, వచ్చే ఎన్నికలు లేదా పొలిటికల్ రీ-ఆర్గనైజేషన్ నాటికి విజయవాడ సెంట్రల్ నుంచి వంగవీటి రాధాకృష్ణ పోటీకి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు

## గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

ఇందులో కర్నూలు జిల్లాలో 400 మెగావాట్ల సోలార్ పవర్, అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఉంది. ఈ మేరకు టాటా, సుజలం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రాజెక్టులకు భూమి పూజ చేశారు. రూ.5750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోందని లోకేశ్ పేర్కొన్నారు. తద్వారా 4000ల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 3400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టుల ద్వారా 1100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయం అందుతుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఏపీపైనా, తమ పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీకని లోకేశ్ వివరించారు. “టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల అనుబంధం ఉంది. భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచస్థాయి ఓడరేవులు ఉన్న ఏపీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్?లో ఉత్పత్తయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ రాష్ట్రం నుంచి చేసే స్థాయికి చేరతాం.”

‘గతేడాదితో పోలిస్తే ఈ ఒక్క సంవత్సరంలోనే ఏపీలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగింది. ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైంది. ఆంధ్రప్రదేశ్?లో 2024 జూన్?లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఏపీని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం. 15,000ల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని’ లోకేశ్ వివరించారు.

“ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్?మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్ ప్రపంచస్థాయి తయారీ వరకు మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్?ను ఏపీలో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించు కోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్?గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.” రాష్ట్ర ప్రభుత్వం, ఐఐటీ తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పని చేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నామని లోకేశ్ తెలిపారు. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్?ను నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలమన్నారు. టాటా రెన్యూవబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లా పత్తికొండకు లోకేశ్ రావడంతో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా పార్టీ జెండాలు పట్టుకొని ఆయనతో కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. అక్కడ వేరుశనగ కాయలు అమ్ముకునే మహిళతో కాసేపు ముచ్చటించిన లోకేశ్? ఆమె అమ్ముతున్న విధానాన్ని చూసి ముచ్చట పడి వేరుశనగ కాయలను కొనుగోలు చేసి డబ్బులు కూడా అందజేశారు.

## దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

-మొదటిపేజీ తరువాయి

అధికారులతో గురువారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పథకాల పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల డిస్కంపై రూ.100 కోట్లకు పైగా ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. విద్యుత్ నష్టాల నివారణకు భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు.

**గోదావరి పుష్కరాల విద్యుత్ శాఖ సమాయత్తం**

రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మార్చి 2027 నాటికి పుష్కరాలకు సంబంధించిన అన్ని విద్యుత్ మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నాటికి కొత్తగా 19 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరును వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించగా, జూన్ నాటికి అర్హులైన దరఖాస్తుదారులకు కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. గత ఏడాదిలో సుమారు 12 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు.

**దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు**

విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దని మంత్రి ప్రజలను హెచ్చరించారు. ఉద్యోగ నియామకాలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు విద్యుత్ శాఖ పరిధిలో 450 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

**నెల్లూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో పులివెందుల విద్యార్థిని దివ్యశ్రీకి స్వర్ణ పతకం

**- విద్యతో పాటు క్రీడలు ముఖ్యం ముఖ్య అతిథి భూమిరెడ్డి ఉమాదేవి**






పులివెందుల అర్బన్ కదిలించే వార్త జులై 30:

జమ్మూ అండ్ కాశ్మీర్‌లోని జమ్మూ తావిలో 'నేషనల్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పులివెందులకు చెందిన విద్యార్థిని వై.దివ్యశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్-14 బాలికల బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో దివ్యశ్రీ అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం (గోల్డ్ మెడల్) సాధించింది.జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన ఈ విద్యార్థినిని ఆమె చదువుతున్న ఎక్సలెంట్ నాగార్జున స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక,శారీరక వికాసానికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి పట్టణానికి, పాఠశాలకు మంచి పేరు తెచ్చిన వై.దివ్యశ్రీని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని దివ్యశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

# కౌన్సిల్ ఆమోదం పొందిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు వైఎస్ మనోహర్ రెడ్డి వినతి**



పులివెందుల,కదిలించే వార్త

జూలై 30: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిల్ ఆమోదం పొందిన పెండింగ్ పనులకు వెంటనే టెండర్లు పిలిచి, టెండర్లు పూర్తయిన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించి పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ మునిసిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ తనూజను కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తో కలిసి గురువారం కమిషనర్‌ను కలవడం జరిగింది .ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన అనేక పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా రోటరీపురం రోడ్లు, యూజీడీ పనులకు ఇప్పటి వరకు టెండర్లు పిలవకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు.అదేవిధంగా చెన్నారెడ్డి కాలనీలో యూజీడీ పనులను తక్షణమే చేపట్టడంతో పాటు, సియోన్‌పురం స్టోర్మ్ వాటర్ డ్రెయిన్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో వీధి దీపాల కొరత కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన చోట్ల వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.ప్రజా అవసరాలకు సంబంధించిన ఈ పనులను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్ మనోహర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణలో విద్యార్థుల పాత్ర కీలకం

**- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య**






వేముల కదిలించే వార్త జులై 30

డెంగ్యూ జ్వరాల నివారణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లల గూడూరు గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, 'యాంటీ లార్వా ఆపరేషన్' నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం' పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి శ్రీ సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న దోమల నివారణోపాయాలను తమ ఇళ్లల్లో తల్లిదండ్రులకు వివరించడం ద్వారా సమాజంలో త్వరగా అవగాహన పెరుగుతుంది.ప్రమాదకర జ్వరాలు: డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వంటి జ్వరాలు ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తాయి. తీవ్రమైన జ్వరం, చలి, తలనొప్పి, కీళ్లనొప్పులు, శరీరంపై దద్దుర్లు, ప్లేట్‌లెట్స్ తగ్గడం వంటివి వీటి ముఖ్య లక్షణాలు.నివారణ చర్యలు (చెక్ - క్లీన్ - కవర్): ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలి. నీటి నిల్వలను చెక్ చేసి, లార్వాలు ఉంటే క్లీన్ చేయాలి. నీటి పాత్రలపై మూతలు పెట్టి కవర్ చేయాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పందులను గ్రామానికి కనీసం 5 కిలోమీటర్ల దూరంలో ఉంచాలి. నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలి. సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచి, పచ్చి వేపాకు పొగ వేయడం మంచిది." అని సిద్దయ్య తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీమతి ఉషారాణి మాట్లాడుతూ రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే గర్భిణులు, బాలింతలు, పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ప్రజల భాగస్వామ్యంతోనే 'దోమలపై దండయాత్ర' పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుంది. అని శ్రీమతి ఉషారాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, రమణమ్మ, ఆశా కార్యకర్త గంగమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ప్రభాకర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేళ శ్రీ చైతన్యలో ఆధ్యాత్మిక చైతన్యం

**- ధ్యానంతో ఏకాగ్రత.. విలువలతో వ్యక్తిత్వ వికాసం**

**- రెండు రోజుల శిక్షణలో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన నిపుణులు**





వేంపల్లె (కదిలించే వార్త), జూలై 30:

గురు పౌర్ణమి సందర్భంగా వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్‌లో నిర్వహించిన రెండు రోజుల ఆధ్యాత్మిక విద్యా శిక్షణ కార్యక్రమం గురువారం ఘనంగా ముగిసింది. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, సేవాభావం పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష విజయాన్ని సాధించింది.రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ సీనియర్ మేనేజర్, పిరమిడ్ జ్ఞాన దీప్తి స్పిరిచువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ కె. శ్రీనివాసరావు విద్యార్థులకు ధ్యానం, ఆధ్యాత్మికత, గురువుల గొప్పతనం, నైతిక విలువలు, సమయపాలన, వ్యక్తిత్వ వికాసంపై స్ఫూర్తిదాయకంగా మార్గనిర్దేశం చేశారు. ప్రతిరోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరిగి విద్యతో పాటు జీవితంలోనూ అత్యున్నత విజయాలు సాధించవచ్చని వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్య విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్యే నిజమైన విద్య అని, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఇటువంటి విలువాధారిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా శ్రీ కె. శ్రీనివాసరావు, శ్రీమతి ఇంద్రమ్మ, శ్రీమతి ఇంద్రాణిలను పాఠశాల చైర్మన్ శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను కొనియాడుతూ పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ శ్రీ లక్కు ప్రేమానందరెడ్డి, శ్రీ మనోహర్ రెడ్డి, శ్రీ కిషోర్, శ్రీ నాయుడు, శ్రీ దస్తగిరి భాష, శ్రీ రామయ్య, శ్రీ వేణు, పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రెండు రోజుల ఆధ్యాత్మిక శిక్షణతో విద్యార్థులు ధ్యానం, నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అనేక అంశాలను అవగాహన చేసుకుని, గురు పౌర్ణమి సందేశాన్ని జీవితంలో ఆచరణలో పెట్టాలని సంకల్పించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సర్పంచ్, ఎంపిపి, జడ్పీటీసీ లను కైవసం చేసుకోవడం ఖాయం

**- వైఎస్ఆర్సీపి ఎంపిటిసి సభ్యులు**

**- టిడిపి కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**



వేంపల్లె కదిలించే వార్త జులై 30:

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వేంపల్లె మండలానికి సంబంధించిన అన్ని సర్పంచ్ లు, ఎంపిపి, జడ్పీటీసీ స్థానాలను వైఎస్ఆర్సీపి కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీకి చెందిన ఎంపిటిసి సభ్యులు వెల్లడించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిటిసి సభ్యులు కటిక చంద్రశేఖర్, పద్మా రాజ్ కుమార్, హబిబుల్లా, రహంతుల్లా ఖాన్, భారతీ, మెహతాజ్, బ్రహ్మయ్య లు మాట్లాడుతూ గత రెండేళ్ల టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇప్పటికీ అమలు కాలేదన్నారు. మిగిలిన హామీల అమలు కూడా అరకొరగా కొనసాగుతున్నట్లు ఆరోపించారు. గత నాలుగు రోజుల నుంచి టిడిపి కూటమి ప్రభుత్వం కొత్త తరహా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టిందని, దీంతో ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప కూటమి నేతలు చేసిందేమి లేదని మండిపడ్డారు. టిడిపి కూటమి నేతలు అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చారని, వీటిని ఇప్పటికీ మెజారిటీ స్థాయిలో అమలు చేయలేక పూర్తి వైఫల్యం చెందారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500, అన్నదాత కింద రూ.20 వేలు ఆర్థిక సాయం, 50 ఏళ్లకే పెన్షన్ తదితర అనేక పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకుండా అలాగే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమని చెప్పి అరకొరగా అమలు చేయడం, ఉచిత బస్సు ప్రయాణంలో బస్సులు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చెప్పిన సంక్షేమ పథకాలే కాకుండా చెప్పనివి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలన, ప్రస్తుత టిడిపి కూటమి అసంతృప్తి పాలనపై ప్రజలు గుర్తిస్తున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపికి విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.


కదిలించే వార్త కావాలి

# షిరిడి సాయినాథ్ కి ప్రత్యేక పూజలు

**- ప్రత్యేక అలంకారంలో సాయినాధుడు**

**- ఆలయ అభివృద్ధికి సహకరించండి**

**- ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య**



పులివెందుల కదిలించే వార్త అర్బన్ జులై 30

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వ హిం చారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

## ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా ఫలకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం

**- వేల్పుల గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకున్న తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మా రెడ్డి జోగిరెడ్డి,**

**- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి**

వేముల కదిలించే వార్త జులై 30ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా వేముల మండలం బెస్తవారిపల్లె గ్రామంలో తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మా రెడ్డి జోగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి,ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన పేదలకు శాశ్వత నివాస గృహాలు (పక్కా ఇళ్లు) కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే యువతకు ఉద్యోగ అవకాశాలు, అర్హులైన వారికి పెన్షన్లు, "తల్లికి వందనం" పథకంలో ఉన్న లోటుపాట్లను పరిష్కరించాలని, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేకపోతున్న కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలని పలువురు కోరారు.ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్ల పార్థసారథి రెడ్డి హామీ ఇచ్చారు.ప్రజల వద్దకు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేర్ల శేషారెడ్డి,మబ్బుచింతలపల్లె శ్రీనాథ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, క్లస్టర్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, కోనపురి శివరాం,బెస్తవారి పల్లెరంగారెడ్డి,వేల్పుల సొసైటీ అధ్యక్షుడు రాగిపిండి సుధాకర్ రెడ్డి, హనుమంత రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# గ్రామాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

## - గ్రామాభివృద్ధి దిశగా మరో ముందడుగు... మారెడ్డి లత రెడ్డి






పులివెందుల కదిలించే వార్త జూలై 30 పులివెందుల

ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ( జి పి డీపీపీ)--2026--27 శిక్షణ కార్యక్రమంలో పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతా రెడ్డి పాల్గొన్నారు..ఈ సందర్భంగా లత రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పంచాయతీ రాజ్ ఔ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నారని తెలిపారు.పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి మార్గదర్శకత్వంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, గ్రామాల ప్రగతే లక్ష్యంగా ప్రజలతో కలిసి నిరంతరం పనిచేస్తున్నామని మారెడ్డి లతా రెడ్డి పేర్కొన్నారు."గ్రామాల అవసరాలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఆమె సూచించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పులివెందుల వైస్ ఎంపిపి విశ్వనాథ రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన,

## - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం : బీటెక్ రవి





తొండూరు కదిలించే వార్త జూలై 30

తొండూరు మండలం కొరవానిపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్)" కార్యక్రమంలో తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి తో కలిసి పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పాల్గొన్నారు.లి ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, గ్రామాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బీటెక్ రవి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తొండూరు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# బ్లేడ్‌తో విచక్షణారహిత దాడి.. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

## - వేంపల్లె లో కలకలం.. టైల్స్ పనుల లావాదేవీల వివాదమే కారణమని ఆరోపణలు

## - నిందితుడు పోలీసుల అదుపులో.. కేసు నమోదు చేసి దర్యాప్తు





వేంపల్లె (కదిలించే వార్త) క్రైమ్ న్యూస్ జూలై 30:

వేంపల్లె పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న బ్లేడ్ దాడి తీవ్ర కలకలం రేపింది. టైల్స్ పనులకు సంబంధించిన లావాదేవీల వివాదం నేపథ్యంలో జరిగిన ఈ ఘటనలో శ్రీరాంనగర్ గుట్ట ప్రాంతానికి చెందిన నరసింహులు, వెంకటరమణ అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మెడ, గొంతు భాగాల్లో గాయాలు కావడంతో తృటిలో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.బాధితుల కథనం ప్రకారం, టైల్స్ పనుల లావాదేవీల విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయగా, ప్రత్యర్థి ఒక్కసారిగా బ్లేడ్‌తో దాడి చేశాడు. దీంతో ఇద్దరు యువకులు రక్తస్రావంతో కుప్పకూలగా, స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న వేంపల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.క్షతగాత్రులు చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి గల పూర్తి కారణాలు, ఇతర కోణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ సంఘటనతో రాజీవ్‌నగర్ కాలనీలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసుల సకాలంలో జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి మోసాల మీద మోసాలు చేస్తుంది.

## - వైఎస్ఆర్సిపి 34 డివిజన్ ఇంచార్జ్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ అలీ అక్బర్




కడప జూలై 30 కదిలించే వార్త కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి మోసాల మీద మోసాలు చేస్తుంది ప్రస్తుతం కడప లో 15వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్ ) నిధులను కొద్ది వార్డులకే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని వైఎస్ఆర్సిపి 34 డివిజన్ ఇంచార్జ్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సాలీ అక్బర్ మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప నగరపాలక సంస్థచివరి జనరల్ బాడీ మీటింగ్ సమావేశంలో కడప కార్పొరేషన్ మేయర్ పాక సురేష్ ప్రతి ఒక్క డివిజన్ కి నిధులు కేటాయించడం జరిగింది కానీ నీదులు కొంత డివిజన్లకు మాత్రమే మళ్లించడం చూస్తుంటే కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కడప నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉండగా, సమస్యలు అన్ని వార్డుల్లోనూ ఉన్నాయి. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం 7 లేదా 8 డివిజన్లకే కేటాయించడం సమాన అభివృద్ధి సూత్రాలకు విరుద్ధం.ప్రజలందరూ సమానంగా పన్నులు చెల్లిస్తున్నప్పుడు, అభివృద్ధి పనులు కూడా అన్ని వార్డుల్లో సమానంగా జరగాలి. కొన్ని డివిజన్లకే నిధులు కేటాయించి, మిగిలిన వార్డులను నిర్లక్ష్యం చేయడం వల్ల అక్కడి ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు.అందువల్ల 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ఏ ప్రమాణాల ఆధారంగా పనులు ఎంపిక చేశారో తెలియజేయాలి. మిగిలిన అన్ని డివిజన్లలో కూడా అత్యవసర అవసరాలను గుర్తించి, సమాన న్యాయంతో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కడప నగరపాలక సంస్థను, సంబంధిత అధికారులను కోరుతున్నాము.

# ఇంటింటికీ తెలుగుదేశం" (డోర్ టు డోర్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలి

## - మండల టీడీపీ ఇన్‌చార్జ్ శివ మోహన్ రెడ్డి



తొండూరు కదిలించే వార్త జూలై 30

తొండూరు మండల టీడీపీ ఇన్‌చార్జ్ శివ మోహన్ రెడ్డి నివాసంలో "ఇంటింటికీ తెలుగుదేశం" (డోర్ టు డోర్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత ప్రభావవంతంగా తీసుకెళ్లే విధానాలు, ఇంటింటికీ చేరుకుని కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటికీ చేరుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తొండూరు మండల టీడీపీ ఇన్‌చార్జ్ శివ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలినినో పై రైతులకు అవగాహన సమావేశం




సింహాద్రిపురం కదిలించే వార్త జూలై 30 ఎలినినో ప్రభావం తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలపైన రైతులకు అవగాహన పొందాలి అని తెలిపిన,ఊటుకూరు వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి ప్రభాకర్ రెడ్డి మరియు శాస్త్రవేత్తల బృందములినోటిఫైడ్ పంటలకు 31 వతేది లోగా ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి పసల్ బీమా ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపిన డి డి ఏ టి.వెంకటేష్ తెలిపారు.సింహాద్రిపురం మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో ఎలినినో ప్రభావం గురించి గ్రామ రైతులతో అవగాహన సమావేశంలో డిడిఏ,టి వెంకటేష్ అలాగే కడప వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి ,కేవికె శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్ , ఆగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నట్లు ఎడి ఏ కె రామమోహన్ రెడ్డి,మరియు మండల వ్యవసాయ అధికారి ఏవి రామానుజన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలినినో ప్రభావం ను తట్టుకునే పంటలను సాగు చేయాలి అని తెలిపారు. బెట్ట పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలి అని సూచించారు.ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి అన్నారు.స్వల్ప కాలిక రకాలైన కంది,జొన్న,ఉలవ, కొర్ర,రాగి,మినుము ,సజ్జ పంటల పైన రైతులు దృష్టి సారించాలి అన్నారు.వ్యవసాయ రంగంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి,వాటి వాడకం వలన రైతులకు కలిగే మేలు గురించి అవగాహన కల్పించారు. తదుపరి కీటక విభాగం శాస్త్రవేత్త సునీల్ మాట్లాడుతూ ఆయా పంటల్లో ఆశించే చీడ పీడలు మరియు వాటి నివారణ చర్యలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు.బత్తాయి పంటలో పొలుసు పురుగు నివారణ గురించి,ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు గురించి రైతులకు తెలిపారు.

# ప్రజా సమస్యలపై బీటెక్ రవి ఫోకస్

## - డోర్ టు డోర్ ఫిర్యాదులపై అధికారులకు ఆదేశాలు.. వెంటనే చర్యలు ప్రారంభం



వేంపల్లె (కదిలించే వార్త), జూలై 30:

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమంలో ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను స్వయంగా విన్న ఆయన సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, ఆలస్యం చేయకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.బీటెక్ రవి ఆదేశాల మేరకు అధికారులు తక్షణమే స్పందించి, ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియను ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన బీటెక్ రవి, అధికారులను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేమకుమార్, ఎస్సీ నాయకులు ఈశ్వరయ్య, మడక శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ ఈఓ కవిత, పీఆర్ ఏఈ శ్రీనుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించినట్లు సమాచారం.

# ఆగస్టు 13, 14,15 తేది లలో ఉరుసు మహోత్సవాలు



కడప జూలై 30 కదిలించే వార్త


ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రం కడప అమీన్ పీర్ దర్గా లో హజరత్ అమీన్ పీర్ స్వామివారి ఉరుసు మహోత్సవాలు ఆగస్టు 13 నుంచి15 వరకు ఘనంగా నిర్వహించనున్నారు.

13తేదిన గంధ మహోత్సవం,

14 తేదిన ఉరుసు మహోత్సవం

15 తేదిన తహలీల్ ఫతేహ ఈ మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఫాతేహా, దువా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర ,తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ ఉరుసు కార్యక్రమాలు కడప అమీన్ పీర్ దర్గా 11పీఠాధిపతి అమీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టి ఉల్ ఖాదరి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడును. కావున భక్తులందరూ విచ్చేసి స్వామివారి ఆశీర్వాదం పొందవలసిన కోరుచున్నాము.

# కమల్ అమృత్ వాణి-212



మిత్రం తద్భవతి శ్రేష్ఠం యద్బ్రూయాత్ హితమాదరాత్।
దోషానపి నివార్యైవ సన్మార్గే ప్రణయేత్ సఖా॥

తాత్పర్యం.

నిజమైన మిత్రుడు పొగడడు, మార్గం చూపుతాడు.

తప్పు చేస్తే సరిదిద్దేందుకు ధైర్యంగా చెప్పేవాడే మంచి స్నేహితుడు.సుఖంలోనే కాదు, కష్టంలోనూ తోడుగా నిలుస్తాడు.మిత్రత్వం విశ్వాసంపై నిలబడాలి.హితబోధ ప్రేమకు ప్రతీక.మంచి మిత్రుడు జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాడు.స్వార్థరహిత స్నేహం అరుదైన వరం.సద్బుద్ధిని పెంచే మిత్రుడే నిజమైన స్నేహితుడు.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

# ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.

## - కమిషనర్ శారదా దేవి.

తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 30 జూలై

తిరుపతి నగరంలోని అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని వ్యాపారాలు నిర్వహించుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎఫ్.ఏ.సి శారదా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి, కమీషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పిర్యాదు అందిన జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, తనిఖీ చేశారు. ఈ సందర్బంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీ నందు బిర్యానీ తిని చిన్న అమ్మాయికి ఫుడ్ పాయిజన్ కావడంతో అమ్మాయి ట్రీట్మెంట్ తీసుకుంటున్నదని తెలిపారు. ఈ పిర్యాదు మేరకు తాను, , వెటర్నటి ఆఫీసర్, ఫుడ్ సేఫ్టిఆఫీసర్, సిబ్బంది, శానిటరీ సిబ్బంది తో కలిసి తనిఖీకి చేశామని తెలిపారు. అందులో హోటల్ నడుపుటకు మునిసిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేయడం, బిర్యానీ తయారు చేయుటకు వినియోగించు చికెన్ సరిఅయిన స్టోరేజ్ లో లేకపోవడం, వాటిపై లేబల్స్, తయారీ గడువు లేబుల్స్ లేకపోవడం గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ సరైన కండిషన్ లో లేకపోవడం, స్టోర్ రూంలో వంటకు వినియోగించు కూరగాయలు పాడాయి ఉండడం, స్టోర్ నందు పనికిరాని వ్యర్థాలు నిలువ చేసి ఎలుకల విసర్జనలు ఉండడం, క్లీనింగ్ ఏరియా వంటరూమ్ కలిసి ఇన్ శానిటరీ కండిషన్ లో ఉండడం, మరియు పనిచేసె వర్కర్సకి పర్సనల్ ప్రొటెక్షన్ కిట్స్ లేకపోవడం వలన సప్లైలో కాంటామినేషన్ రావడానికి



ఆస్కారమున్నందున ప్రజారోగ్య దృష్ట్యా బిర్యానీ ఫ్యాక్టరీ హోటలను సీజ్ చేశామని తెలిపారు ఫూడ్ సెప్టి ఆఫీసర్ అందుబాటులో ఉన్న బిరియానిని, పెరుగును శాంపుల్స్ తీసి కల్తీ పరీక్ష నిమిత్తం పంపామని తెలిపారు. ప్రతి ట్రేడ్ ఓనర్స్ మునిసిపల్ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకొని సరైన నాణ్యత ప్రమాణాలతో వ్యాపారం చేయాలనీ హెచ్చరించారు. ప్రజలకుడా తక్కువరేట్లు చూసి మోసపోవద్దని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలనీ తెలిపారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం. టీడీపీ సిటీ ఆర్గనైసింగ్ సెక్రటరీ బోనం శిలాస్.



కడప జూలై 30 కదిలించే వార్త రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని తెలుగుదేశం పార్టీ నగర కార్యనిర్వాహక కార్యదర్శి బోనం శిలాస్ పేర్కొన్నారు.వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వ విజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారానికి పాల్పడుతోందని విమర్శించారు.మెగా డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరిగాయో ఆధారాలతో నిరూపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలుమార్లు బహిరంగ సవాల్ విసిరినా, వైసీపీ నాయకత్వం అందుకు స్పందించలేదన్నారు . ఆరోపణలు చేయడం కంటే వాటిని వాస్తవాలతో నిరూపించడం ముఖ్యమని పేర్కొన్నారు.డీఎస్సీ నియామకాలపై కోర్టులను ఆశ్రయించిన వైసీపీ వర్గాలు తమ వాదనలను న్యాయస్థానాల్లో నిలబెట్టుకోలేక చివరకు కేసులను ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. ఇప్పుడు కొత్త అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారే తప్ప డీఎస్సీలో ఎలాంటి తప్పిదాలు జరగలేదన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్న విషయాన్ని వైసిపి నాయకులకు తెలియదా? కేవలం ప్రభుత్వం పైన బురదల్లిందుకే ఈ చౌక భారు విమర్శలు చేస్తు, వారి ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ నాయకుల ర్యాలీలు ధర్నాలు చేస్తూ మితిమీరిన ఆగడాలను సహించేది లేదని పేర్కొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష - రూ.6లక్షల జరిమానా

## - తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

తిరుపతి క్రైమ్ కదిలించే వార్త 30 జూలై తిరుపతిలోఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి శ్రీ నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం =ాూూఖీ కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ శ్రీ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ శ్రీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 49/2017 కేసులో ఈ ముద్దాయి భీమవరం ఫారెస్ట్ బీటు, పుల్లయ్య గుట్ట ప్రాంతం, చిత్తూరు ఈస్ట్ ఫారెస్ట్ డివిజన్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ఎర్రచందనం దుంగలతో అన్నామలై మురుగేషన్ అనే వ్యక్తి అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, సేలం జిల్లా పట్టనాగి పాళయం తాలూకా, పట్టి వెలవు గ్రామానికి చెందిన వాడు. ఇతను కోర్టుకు హాజరు కాకపోవడంతో ఎన్బీడబ్ల్యూ జారీ చేసి రప్పించారు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు



ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోట నియామకాల విషయంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువతలో అనేక సందేహాలు

## - వైఎస్ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల శివ యాదవ్

కడప జూలై 30 కదిలించే వార్త




డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో అనేక సందేహాలు ఉన్నాయి. లక్షలాది మంది యువత పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే, స్పోర్ట్స్ కోటా నియామకాలు ఏ జీవో ప్రకారం జరిగాయో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని వైయస్సార్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల శివ యాదవ్ మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ2012లో వచ్చిన జి.ఓ. నెం.74 ప్రకారం ఒక విధానం ఉండగా, 2025లో జి.ఓ. నెం.4, జి.ఓ.47 ద్వారా మరో విధానం తీసుకొచ్చారు. అయితే డీఎస్సీ నియామకాల్లో చివరకు ఏ జీవో అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలి.మాకు క్రీడాకారులపై ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఉపాధ్యాయ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలి. అందుకే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై స్వతంత్రంగా సమగ్ర విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం.అలాగే జి.ఓ.74, జి.ఓ.4, జి.ఓ.47 అమలు ఎలా జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఎంపికైన అభ్యర్థుల మెరిట్, అర్హతలు, ఎంపిక విధానాన్ని ప్రజలకు వెల్లడించాలి.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. నిరుద్యోగ భృతిని అమలు చేయాలి.యువత భవిష్యత్తు కోసం వైఎస్సార్సీపీ ఈ నెల 31వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మెగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తుంది. యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం గొంతెత్తాలని కోరుతున్నాను.

# అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి వైభవంగా పుష్పయాగ మహోత్సవం

## - బ్రహ్మోత్సవాల్లో జరిగిన లోపాల పరిహారార్థం శాస్త్రోక్తంగా నిర్వహణ



తిరుపతి రూరల్ కదిలించే వార్త 30 జూలై

వడమాల పేట మండలంలోఅప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. జూన్ 25 నుంచి జూలై 3 వరకు నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిత్యకైంకర్యాలు, ఉత్సవాల సందర్భంగా అర్చకులు, అధికారులు, పరిచారకులు, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాల



పరిహారార్థం ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం ఈ పుష్పయాగాన్ని నిర్వహించారు.స్నపన తిరుమంజనం, పుష్పాల శోభాయాత్రఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీటితో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పుష్పయాగానికి వినియోగించే పుష్పాలను మూలమూర్తి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ప్రదక్షిణతో పాటు మాడవీధుల్లో శోభాయాత్రగా తీసుకువచ్చారు. ఆధ్యాత్మిక వైభవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం వీధి ఉత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో శ్రీహరి రావు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, కంకణభట్టార్ సూర్యకుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హరినాథ్ రెడ్డి వైకుంఠ సమారాధనలో తులసి రెడ్డి



చక్రాయపేట (కదిలించే వార్త) జూలై 30:

చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొవ్వూరి హరినాథ్ రెడ్డి వైకుంఠ సమారాధన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసి రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ హరినాథ్ రెడ్డి తనకు ఎంతో ఆత్మీయుడని, హుందాగా, గౌరవప్రదంగా జీవించిన వ్యక్తిగా కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుమారుడు గణపతి రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు గడికోట ద్వారకనాథ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులపై మరో బాదుడు.. ఆగస్ట్ నుంచి వీటి ధరలు భారీగా పెరిగే ఛాన్స్..


సామాన్యులకు షాకింగ్ న్యూస్. ఆగస్ట్ నుంచి ధరల బాదుడు తప్పదు. చాలా వస్తువలు ధరలు పెరిగే అవకాశముంది. హెయిర్ ఆయిల్, టీ, దుస్తుల ధరలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పెరగనున్నాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వీటి ధరలు పెరగనున్నాయి.అమెరికా-ఇరాన్ మధ్య వార్, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసును దెబ్బతీశాయి. దీంతో వస్తువుల రవాణా ఖర్చు మరింత పెరిగింది. ఈ ప్రభావంతో ముడి పదార్థాలు, ముడి చమురు, ప్యాకేజింగ్ సామగ్రి ధరలు ఇటీవల కాలంగా భారీగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక పరిస్థితులు, రాజకీయ అనిశ్చితి ద్రవ్యోల్బణంపై ఒత్తిడిని మరింత పెంచాయి. అంతర్జాతీయంగా నెలకున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం భారత్‌పై కూడా పడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువలో భారీగా హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. దీని వల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులకు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ పెరిగిన ఖర్చులను భర్తీ చేయడానికి అనేక కంపెనీలు ఆగస్టు నుండి ధరలను పెంచడానికి ప్రణాళికలు రచిస్తున్నాయి.

ఏయే వస్తువుల ధరలు పెరగనున్నాయంటే..?

టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, స్మార్ట్‌ఫోన్‌ల వంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలతో పాటు దుస్తులు, కార్లు, హెయిర్ ఆయిల్ ధరలు పెరిగే అవకాశముంది. ఆగస్ట్ నుంచే ఈ పెరుగుదల ఉండనుందని తెలుస్తోంది. ప్యాక్ చేసిన టీ ధరలు 6 శాతం నుండి 8 శాతం వరకు, హెయిర్ ఆయిల్ 6% నుండి 8% వరకు, టీవీల ధరలు 4 శాతం నుండి 6 శాతం వరకు, రిఫ్రిజిరేటర్ ధరలు 4 శాతం నుండి 6 శాతం వరకు, వాషింగ్ మెషీన్ ధరలు 10 శాతం వరకు, బ్రాండెడ్ దుస్తులు 8 శాతం వరకు పెరిగే అవకాశముంది. మెమరీ చిప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ భాగాల ధరల ఇటీవల భారీగా పెరిగాయి. దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్ టాప్ ధరలు భారీగా పెరగనున్నాయి.

పెరగనున్న కార్ల ధరలు..

పెరిగిన ముడిసరుకు ఖర్చుల కారణంగా పలు వాహన తయారీ సంస్థలు ఆగస్టు నుంచి ధరలు పెంచాలని భావిస్తున్నాయి. మారుతి సుజుకి ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.30 వేల వరకు పెంచే అవకాశం ఉన్నట్లు తెలస్తోంది. ఇక హోండా కార్స్ ఇండియా కూడా ఆగస్టు 1 నుంచి ధరలను సవరించడానికి సిద్ధమవుతోంది. అలాగే మెర్సిడెస్-బెంజ్ ధరలను ఆగస్ట్ నుంచి పెంచాలని యోచిస్తోంది. టాటా మోటార్స్, మహీంద్రా ఈ నెల ప్రారంభంలోనే కొన్ని మోడళ్ల ధరలను పెంచాయి. పెరుగుతున్న ఖర్చులను తగ్గించుకునేందుకు వినియోగదారులపై భారం మోపేందుకు సిద్ధమవుతున్నాయి. ఆగస్ట్ నుంచే వీటి ధరలు పెరిగే అవకాశముంది. దీంతో వచ్చే



నెలలో అనేక వస్తువుల ధరలు పెరగడం చూడవచ్చు. పండుగ సీజన్‌లో దుస్తులు, స్మార్ట్ ఫోన్లు లాంటివి కొనాలంటే ఇక ఎక్కువ ఖర్చు పెట్టాల్సిందే.

# రండి కలిసి రండి కదలి రండి



**- మనకోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం**
**- మహర్షి వాల్మీకి సేవాదళ్ ఆధ్వర్యంలో**
**- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తిరుకు నిరసనగా వాల్మీకి బోయల ర్యాలీ**

అనంతపురం, కదిలించే వార్త, జులై 30 :


ఎన్నికల సమయంలో మేము అధికారం లోకి రాగానే వాల్మీకి భోయలను ఎస్టిలో చేరుస్తామని హామీ ఇస్తారు వచ్చిన తర్వాత మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోలేదుఅనంతపురం నడిబొడ్డున టవర్ క్లాక్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించాలని మహర్షి వాల్మీకి సేవాదళ్ కమిటీ నిర్ణయించింది1-8-2026 శనివారం రోజున ఉదయం 10:30 కు టవర్ క్లాక్ నుంచి బయలుదేరి కలెక్టర్ ఆఫీస్ వరకు వెళ్లడం జరుగుతుందిఈ ర్యాలీకి వాల్మీకి బోయలందరూ రావాలని ఈ ర్యాలీని జయప్రదం చేయాలని ప్రతి ఒక్క వాల్మీకిని కోరుకుంటున్నాం కొండపల్లి అక్కులప్ప రాష్ట్ర అధ్యక్షులు మహర్షి వాల్మీకి సేవాదళ్ కోకటం రవి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహర్షి వాల్మీకి సేవాదళ్ బుల్లెట్ లింగమయ్య శ్రీ మహర్షి వాల్మీకి సేవాదళ్ అధ్యక్షులు భానుకోట శివ జిల్లా అధ్యక్షులు అనంతపురం బోయ రామాంజనేయులు జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతపురం మహర్షి వాల్మీకి సేవాదళ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడితే మూల్యం చెల్లించుకుంటారు

**- వైసీపీకి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక**
**- 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో ఇంటింటికి కూటమి ప్రభుత్వం**
**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే**
**- డీఎస్సీ గురించి ఏడాదిన్నర తర్వాత గుర్తొంచిందా అని నిలదీసిన దగ్గుపాటి**



అనంతపురం, కదిలించే వార్త, జులై 30 :



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురించి ఆధారాలు లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారని వైసీపీ నాయకులకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు ఎంత మేర వచ్చాయన్నది ఆరా తీశారు. కొందరి ఇళ్లలో ముగ్గరు పిల్లలు ఉన్నా.. తల్లికి వందనం అందిందని సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే నగరంలో జరిగిన అభివృద్ధిపై కూడా సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. ఈ రెండేళ్లలోనే రూ.1290కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడైనా ఇలా పనులు చేశారా అని నిలదీశారు. పిచ్చి తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేస్తే.. సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. సీబీఎన్ బ్రాండ్ తో మంత్రి నారా లోకేష్ 25లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని.. ఒక్క రాయలసీమలోనే లక్ష కోట్లు హార్టీకల్చర్ హబ్ కు కేటాయించేలా ప్రణాళికలు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. పుట్టపుర్తిలో 5వ జనరేషన్ కు సంబంధించిన యుద్ధవిమానాలు తయారు చేసే పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. ఇది ఉమ్మడి జిల్లాకే గర్వకారణమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తే.. ఏడాదిన్నర తర్వాత దీనిపై ఏదో జరిగిందని డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారని వైసీపీ పై విమర్శలు గుప్పించారు. ఒక అబద్ధాన్ని పదే పదే నమ్మించే



ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ బహిరంగ సవాల్ కు రమ్మంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదన్నారు. కేవలం మెగా డీఎస్సీ మాత్రమే కాకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చారన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి చేరేలా బదుల్ని మార్చారన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపులు, టాయిలెట్స్ వద్ద ఉంచి అవమానించారన్నారు. అదే ఈ రోజు ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పిస్తూ.. ప్రతి నెల 1వతేదిన వేతనాలు అందజేస్తున్నారన్నారు. నాడు-నేడు పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చేస్తున్న రద్ధాంతాన్ని ఇప్పటికైనా మానుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ దలవాయి రమాదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, కాశీ విశ్వేశ్వర దేవాలయ ఆలయ చైర్మన్ నరేంద్ర చౌదరి, టిడిపి మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బోయపాటి బాలప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, క్లస్టర్లు ఇంచార్జ్ లు సరిపూటి రమణ, వన్నూరప్ప, గోపాల్ గౌడ్, టిడిపి నాయకులు సరళ, చరిత, వడ్డే భవాని, దాడి శ్రీనివాస్ చౌదరి, మున్వర్, నల్లాని మనోహర్, ఓంకార్ రెడ్డి, వసుంధర, సుజాతమ్మ, అయేషా నేహా, కదిరప్ప, వెంకట సుబ్బన్న పాల్గొన్నారు.



## వైసీపీకి రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి తప్పదు

**- వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవు.. ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- 37మందికి రూ.49.69లక్షల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
**- రెండేళ్లలో 692మందికి రూ.6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ సాయం**
**- ఐదేళ్లలో మీరు ఎంత సాయం చేశారో చెప్పాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి**



అనంతపురం, కదిలించే వార్త, జులై 30 :

వైసీపీ నాయకులు రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కొంటారని.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 33వ విడుతలో 37మందికి రూ.49.69లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ నాయకులు, లబ్ధిదారులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 692మందికి రూ.6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామన్నారు. గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ



ఎంత మందికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేశారో చెప్పాలన్నారు. 692మందిలో 450 మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని.. మైనార్టీల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది అని అన్నారు. వైసీపీ నాయకులకు ప్రజలకు అధికారం ఇస్తే ఎలాంటి కార్యక్రమాలు చేయరని.. మేము చేస్తామంటే చూసి ఓర్వలేరన్నారు. నిత్యం ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారని.. ప్రజలు వారిని చూసి అసహ్యించుకుంటున్నారన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో రూ.3500కోట్లు మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని.. ఇందులో రోజుకి ఒకరి పేరు వెలుగులోకి వస్తోందన్నారు. వరుసగా జైలు బాట పడుతున్నారన్నారు. వారు ఇలాగే కుట్రలు, కుతంత్రాలు చేస్తే మరింత పతనమవుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల పాలన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి..ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, కదిలించే వార్త, జులై 30 :

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అనంతపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో రూపొందించిన ప్రత్యేక పాంప్లెట్‌ను అనంతపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో కనీసం 30 కుటుంబాలను కలిసి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని, వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.

## ఎన్టీఆర్ , పీఎం రావత్ వైద్య సేవలు సకాలంలో అందాలి






అనంతపురం, వైద్యం, కదిలించే వార్త, జులై 30 :డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు, పీఎం రావత్ సేవలు సకాలంలో అర్హులందరికీ అందాలని ఏటువంటి అలసత్వాన్ని సహించబోమని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ ప్రవేట్ ఆసుపత్రిలో పనిచేయుచున్న వైద్య మిత్రులు, టీం కోఆర్డినేటర్ లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాద సందర్భంలో గాయపడిన వారికి సకాలంలో పీఎం రావత్ పథకం ప్రకారం ఎలాంటి ఆలస్యం లేకుండా ఉచిత వైద్య సేవలు అందాలని, దానికై వైద్య మిత్రులు సకాలంలో నమోదు చేసి వైద్య చికిత్స సేవలు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవల కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలు సకాలంలో అందే విధంగా ఆన్లైన్లో నమోదు, అనుమతి ముగించి చికిత్సలకు మార్గం సుగమం చేయాలని ఆయన చెప్పారు. రోగులకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, ప్రలోభాలకు కాకుండా గురికాకుండా వారికి సౌకర్యవంతమైన ఆరోగ్య సేవలు అదేవిధంగా కృషి చేయాలన్నారు. కొందరు అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన పత్రాలతో సమర్పించి, వెంటనే సేవలందించేందుకు సహకరించాలన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలో పొరపాట్లు జరిగితే , అలసత్వం గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. వైద్యమిత్రులు, కోఆర్డినేటర్స్ గత పని విధానాల్ని ఈ సమావేశంలోఆయన సమీక్షించారు.

## ఆగస్టు 1న శ్రీ సత్యసాయి జిల్లాలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ

**- 2,58,822 మంది లబ్ధిదారులకు ?114.65 కోట్ల పంపిణీ**

**- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, జూలై 30:ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆగస్టు 1వ తేదీన చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.మొత్తం లబ్ధిదారులు, 2,58,822 మంది,విడుదల చేసిన నిధులు ?114.65 కోట్లు,పంపిణీ సిబ్బంది 4,831 మంది.ఆగస్టు 1న ఉదయం 6:00 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుంది.పంపిణీ చేపట్టిన మొదటి రోజునే 95% పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పింఛనుదారుల ఇంటి నుంచి పంపిణీ ప్రదేశం 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉంటే, దానికి గల స్పష్టమైన కారణాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి.పింఛన్ పంపిణీ సమయంపై గ్రామాలు, వార్డుల్లో మైకులు, టాం టాం మరియు వాట్సాప్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలి.ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కంట్రోల్ రూమ్‌ల ద్వారా ప్రతి గంటకు పంపిణీ పురోగతిని పర్యవేక్షించాల్సి ఉంటుంది.



# రైతుల కోసం బీమా ప్రీమియం కట్టలేరా?

-- వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా అమలు
-- కూటమి అధికారంలోకి వచ్చాక ఆ పథకానికి మంగళం
-- జూలై 31వ తేదీతో ముగియనున్న బీమా ప్రీమియం చెల్లింపు గడువు
-- ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకోండి
-- ఈ ఖరీఫ్‌లో రైతుల ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించండి
-- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లండి
-- ఖరీఫ్ రెండు నెలలు గడిచిపోయినా 2.60 లక్షల ఎకరాల్లోనే పంట సాగు
-- రెండేళ్లుగా రైతులకు అందని ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా
-- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
-- ప్రత్యామ్నాయ సాగు పంటలకు ఉచితంగా విత్తనాలు అందించాలి
-- రైతు కూలీల వలసలు ప్రారంభం కాకముందే మేల్కొనండి
-- గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోండి
-- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్




అనంతపురం, కదిలించే వార్త, జులై 30 :ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశామని, కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ పథకానికి మంగళం పాడారన్నారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల పేరుతో కోట్లు విలువ చేసే భూములను అప్పనంగా ఇచ్చేస్తున్నారని, అలాంటిది అందరికీ అన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకునేందుకు కనీసం బీమా ప్రీమియంను చెల్లించలేరా? అని ప్రశ్నించారు. అనంతపురం జిల్లా అంటేనే వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో రైతాంగం నష్టపోయారని తెలిపారు. రైతులు ప్రీమియం చెల్లించినా గత ఖరీఫ్, రబీలో పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఈ ప్రభుత్వం అందించలేదని విమర్శించారు. అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాధారణ సాగు విస్తీర్ణం 8 లక్షల 48 వేల ఎకరాలుంటే ఇప్పటి వరకు కేవలం 2 లక్షల 59 వేల 863 ఎకరాల్లో మాత్రమే పంట సాగుచేశారని తెలిపారు. ఇంకా 6 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయలేదని చెప్పారు. ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభం అయితే పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి నోటిఫికేషన్‌ను జూలై 6వ తేదీన విడుదల చేసి.. ఆ తర్వాత రెండ్రోజులకు ప్రీమియం వివరాలు తెలియజేశారన్నారు. అయితే అప్పటికే రైతులు రుణాలు రెన్యూవల్‌తో పాటు కొత్త రుణాలు తీసుకున్నారని అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. కొందరు రైతులు వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పులు చేసి ప్రీమియం చెల్లించిన పరిస్థితి ఉందన్నారు. ప్రతి పంటకూ బీమా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని, జూలై 31కి గడువు ముగుస్తున్నా ఇంకా 1.90 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించలేదన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉచిత పంటల బీమా చేస్తే కొన్ని పంటలకు ఏకంగా రూ.18 లక్షల వరకు బీమా అందిందని గుర్తు చేశారు. జిల్లాలో కీలకంగా ఉన్న వేరుశనగ సాగు ఈ ఖరీఫ్‌లో దారుణంగా పడిపోయిందని, 3.64 లక్షల ఎకరాల సాధారణ సాగు ఉంటే కేవలం 45 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు అయినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే పంట మార్పిడి చేసుకోవాలని చంద్రబాబు చెబుతున్నారని, కానీ ఇప్పటికే వేరుశనగ సాగు కోసం రైతులు ఎకరాకు రూ.640 చొప్పున ప్రీమియం చెల్లించినట్లు తెలిపారు. అలాంటి రైతులు వర్షాభావ పరిస్థితుల్లో పంట మార్పిడి చేసుకుంటే ప్రీమియం పరిస్థితి ఏంటని తెలిపారు. వేరుశనగకు ఎకరాకు ప్రీమియం రూ.640 చెల్లిస్తే కందికి ప్రీమియం రూ.80 మాత్రమేనని, మిగిలిన డబ్బులు రైతులకు తిరిగిస్తారా? లేదా? అనే విషయంపై ఎవరికీ స్పష్టత లేదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబుతో మాట్లాడి బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఒక పంటకు ప్రీమియం కట్టి.. ఈ క్రాప్‌లో మరో పంట ఉంటే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 70 శాతం లోటు వర్షపాతం ఉందని, ఏడెనిమిది మండలాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయని తెలిపారు. పశు గ్రాసం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉలవలు, కందులు, జొన్నలు, అలసందలు, ఆముదం, కొర్రలు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సలహాలు ఇవ్వడం కాకుండా ఆ పంట సాగుకు ఉచితంగా విత్తనాలను అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులందరూ దాదాపు రైతు కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లేనన్న విషయం గుర్తించుకుని రైతుల్లో మానసిక స్థైర్యాన్ని నింపాలని కోరారు. ప్రతిపక్షంగా తాము ప్రశ్నిస్తే కేసులు పెడతామంటూ బెదిరిస్తారని, క్షేత్రస్థాయికి ఎమ్మెల్యేలు వెళితే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ఇక రైతు కూలీలు వలసలు వెళ్లకముందే గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# పరిశ్రమల 'సామాజిక బాధ్యత'తో ఎన్నో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి

- మంత్రి సవితమ్మ
- పరిశ్రమల భాగస్వామ్యంతోనే శ్రీసత్యసాయి జిల్లా సమగ్రాభివృద్ధి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పెనుకొండ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన
- రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి కియా-- ప్రభుత్వం మధ్య ఒప్పందం




పెనుకొండ, కదిలించే వార్త, జూలై 30:

పరిశ్రమలు ఉపాధి కల్పించడంతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధికి కూడా తోడ్పడుతున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో గురువారం కియా సంస్థ మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య రూ.12 కోట్ల వ్యయంతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రి భవనాలు, రోడ్లు, సీసీ డ్రైనేజీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు వంటి మౌలిక వసతుల అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.పెనుకొండ నియోజకవర్గంలో కియా, బెల్ వంటి పరిశ్రమల నుంచి సమీకరించిన సుమారు రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

### ఐటీఐ కళాశాలతో నైపుణ్యాభివృద్ధికి ఊతం

కియా పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం కలిగిన సాంకేతిక సిబ్బందిని తీర్చిదిద్దే లక్ష్యంతో పెనుకొండలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కళాశాల భవన నిర్మాణానికి కియా సంస్థ నుంచి రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమీకరించామని చెప్పారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కళాశాల భవనాన్ని వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

### జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

పరిశ్రమల భాగస్వామ్యంతోనే శ్రీసత్యసాయి జిల్లా సమగ్రాభివృద్ధి.సమన్వయంతో అభివృద్ధి పరిశ్రమలు కేవలం ఉత్పత్తులకే పరిమితం కాకుండా, కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) ద్వారా జిల్లాలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావడం అభినందనీయం. ప్రభుత్వం మరియు పరిశ్రమల మధ్య సరైన సమన్వయంతో పెనుకొండ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం.కియా సంస్థ రూ.12 కోట్లతో చేపట్టనున్న ఐటీఐ కళాశాల భవన నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం తరఫున అన్ని రకాల పూర్తి సహకారాన్ని అందిస్తాం. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు భవనాన్ని అందుబాటులోకి తెచ్చేలా పర్యవేక్షిస్తాం.ఈ ఐటీఐ కళాశాల ఏర్పాటు ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ లభించి, కియా వంటి దిగ్గజ పరిశ్రమల్లో నేరుగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సీఎస్ఆర్ నిధుల రూపంలో లభిస్తున్న రూ.36 కోట్లతో చేపట్టే అంగన్‌వాడీలు, ఆసుపత్రులు,రోడ్లు మరియు తాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో కియా సీఈవో తెహూన్ కిమ్, జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కియా సీనియర్ అడ్వైజర్ జంగ్ హో, లైజనింగ్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి, ఆర్డీవో ఆనంద్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరికృష్ణ,హిందూపురం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.



# సీఎంగా చంద్రబాబుది అభివృద్ధి విజన్...

- వైసిపి నేతగా జగన్ ది అబద్ధాల విజన్
- కూటమి రెండేళ్ల ల్లో నమ్మకం, అభివృద్ధి , సంక్షేమం అమలు
- వైసీపీ పాలనలో జరిగింది విధ్వంసం, అరాచకం, అబద్ధ ప్రచారాలే.
- జగన్ హయంలో ప్రజలకు జరిగిన అభివృద్ధి శూన్యం.
- ఏపీకి బ్రాండ్ లిఅంబాసిడర్లు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబులే
- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి
- బొంతలపల్లి లో ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే
- విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ వేసి విద్యను బోధించిన ఎంఎల్‌ఏ







పుట్టపర్తి, కదిలించే వార్త, జులై 30 :





రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలో ప్రజలకు నమ్మకం, అభివృద్ధి, సంక్షేమాన్ని అందించగా, గత వైసీపీ పాలనలో విధ్వంసం, అరాచకం, అబద్ధ ప్రచారాలే కనిపించాయని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని బొంతలపల్లి ,కంబాలపర్తి గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ఎంఎల్‌ఏ పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. రెండేళ్లలో రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో దేశంలోనే అత్యధికంగా మిగతా రాష్ట్రాల్లో కంటే 25.3 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని తెలిపారు.2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతిని శాశ్వత రాజధానిగా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, దీనిపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రైతుల భూముల భద్రతకు ముప్పుగా మారిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు రెండో సంతకంతో ఆ చట్టాన్ని రద్దు చేసి, రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విస్తృతంగా పెరిగాయని, ప్రస్తుతం ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా వాటిపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. రాయలసీమ రైతాంగ అభివృద్ధి కోసం రూ.30 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు, రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, వ్యవసాయ యంత్రాలు అందిస్తున్నట్లు వివరించారు.పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.2,202.07 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో లక్ష కోట్ల పెట్టుబడులతో పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఆమడగూరులో రూ.51,300 కోట్లతో దేశంలోనే అతిపెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటవుతోందని పేర్కొన్నారు. నియోజవర్గం లో అత్యంత ప్రాధాన్యత గా భావించి 193 చెరువులు, 2 రిజర్వాయర్లు నిర్మాణాన్ని చేపట్టి వచ్చే మూడేళ్లలో అన్ని చెరువులకు కృష్ణా జలాలను అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే నా లక్ష్యం సంకల్పం అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,సచివాలయ సిబ్బంది,కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బొంతలపల్లి లో పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ వేసిన ఎంఎల్‌ఏ

బొంతలపల్లి లో ప్రభుత్వ పాఠశాలను ఎంఎల్‌ఏ శ్రీమతి పల్లె సింధూర రెడ్డి సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు.అక్కడ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని అడిగి తెలుసుకున్నారు . ఉపాధ్యాయులు బోధిస్తున్న ఆయా సబ్జెక్ట్ లను విద్యార్థులతో అడిగి తెలుసుకొని వారికి కొద్దిసేపు పాఠాలను బోధించారు.అనంతరం పుట్టపర్తి మున్సిపాల్టీలోని ఎనుములపల్లి లో చింతా దామోదర్ తండ్రి చింత శ్రీనివాసులు దినకర్మకు ఎంఎల్‌ఏ శ్రీమతి పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. దినకర్మ సందర్భంగా మృతిచెందిన శ్రీనివాసులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే తోపాటు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710